క్లుప్తంగా

20న మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన ఉదయం 10.గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మండల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలు, సంక్షేమ పథకాల తీరుపై చర్చిస్తారన్నారు. కావున వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

మండపేట ఏవోగా ప్రభాకర్



కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండల వ్యవసాయాధికారిగా కె.ప్రభాకర్ నియమితులయ్యారు. ఆయన గతంలో రాయవరం మండల ఏఓగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేసిన ఏఓ కె.ఏసుబాబు పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం మండల ఏఓగా బదిలీపై వెళ్లారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారని సిబ్బంది తెలిపారు.

కపిలేశ్వరపురం ఏవోగా రవి



కపిలేశ్వరపురం: మండల వ్యవసాయాధికారిగా బలుసు రవి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన కె.గంగవరం ఏఓగా పనిచేస్తూ కపిలేశ్వరపురానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఏఓ కేవీఎస్ రమేష్ కుమార్ రాయవరం మండల వ్యవసాయాధికారిగా బదిలీపై వెళ్లారు. నూతన బాధ్యతలు స్వీకరించిన రవికి వ్యవసాయ శాఖ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కె.గంగవరానికి మూర్తి



కె.గంగవరం: మండల వ్యవసాయాధికారిగా ఎ.సద్గురు మూర్తి నియమితులయ్యారు. ఇక్కడ వ్యవసాయశాఖ మండల అధికారిగా విధులు నిర్వహించిన బలుసు రవి కపిలేశ్వరపురం మండలానికి బదిలీ అయ్యారు. కాకినాడ జిల్లా గండేపల్లిలో ఏఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మూర్తి కె.గంగవరం ఏఓగా నియమితులయ్యారు. మూర్తి మాట్లాడుతూ మండలంలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటానని, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

తహసీల్దార్‌గా శ్రీరామ్‌ప్రసాద్

కె.గంగవరం: మండల తహసీల్దార్‌గా టి.శ్రీరామ్‌ప్రసాద్ నియమితులయ్యారు. కె.గంగవరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్‌ప్రసాద్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. తహసీల్దార్‌గా నియమితులైన ప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు అభినందనలు తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామ నామ సప్త సప్తాహం రెండో వారం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహనంపై సోమవారం ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, సభ్యులు జోగా శ్రీను, సాక్షి పద్మనాభం, వాసంశెట్టి చిన్ని, వాసంశెట్టి చిన్నబాబు, నంగి బుజ్జి, బొక్కా భద్రరావు, కోలాటం బృందాలు, సతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన

కపిలేశ్వరపురం: వికసిత్ భారత్‌నే లక్ష్యంగా నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్‌డీఏ పాలన సాగుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. కపిలేశ్వరపురంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నామాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 11 ఏళ్ల నరేంద్రమోదీ పాలన అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్య సాధనకై ప్రతిజ్ఞ చేసి మొక్కను నాటారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ స్థాయిలో మెరుగైన వ్యవస్థగా నిలిపారన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవతో పనిచేస్తుందన్నారు. గూడవల్లి రాంబాబు, ఎస్సీ మోర్చ జిల్లా కార్యదర్శి పెదపాటి వసంత, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు సూరంపూడి సత్యనారాయణ, మండల నాయకుడు తోరం రాము పాల్గొన్నారు.

ఏడాది పాలనంతా వైఫల్యాలే..

- సూపర్‌సిక్స్ అమలు చేశామనడం సిగ్గుచేటు
- కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



రామచంద్రపురంలో కూటమి పాలన వైఫల్యాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు



తణుకువాడలో వెంకటరమణను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తి చేసుకున్న తరువాత సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించుకోవటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని గాంధీపేటలో పార్టీ కార్యాలయం వద్ద సూర్యప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏడాది కూటమి పాలన వైఫల్యాల పేరిట వైఎస్సార్ సీపీ ప్రచురించిన పుస్తకాన్ని పార్టీ పీఏసీ సభ్యుడు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆవిష్కరించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఏడాది తరువాత తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి సీఎం చంద్రబాబు, ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సూపర్‌సిక్స్‌లో రైతులకు ఇచ్చిన హామీని ఈ ఏడాదిలో మీరు అమలు చేశారా? అని సూర్యప్రకాశ్ ప్రశ్నించారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతు నోట్లో మట్టికొట్టి వ్యవసాయాన్ని సర్వనాశనం చేసింది కూటమి ప్రభుత్వమేనన్నారు. విద్యార్థులను, మహిళలను, రైతులను అన్ని వర్గాల వారిని దారుణంగా మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సూర్యప్రకాశ్ విమర్శించారు. ఏడాది కాలంలో అనేకరకాలుగా అన్ని వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. విద్యుత్‌చార్జీల మోతలను మోగించిన ఘనత కూటమిదేనన్నారు. ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని రద్దు చేసి ప్రజలను తీవ్రంగా కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఏడాది కాలంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, మాతా మురళి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మండల కన్వీనర్లు పోలినాటి వరప్రసాద్, పెట్టా శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు వై.సతీష్‌కుమారి, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని తణుకువాడ, శలపాక, దేగలపేట తదితర గ్రామాల్లో సూర్యప్రకాశ్ పర్యటించారు. కార్యక్రమంలో ముందుగా ఇటీవల ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్ నాయకుడు దెయ్యాల వెంకటరమణను నాయకులు పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు నేడు కొందరికే రూ.13 వేలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అన్నమాట నిలబెట్టుకోవడం చేతకాని కూటమి ప్రభుత్వం ఇప్పుడేం సమాధానం చెబుతుందన్నారు. పాఠశాలల నిర్వహణ కోసమంటూ మినహాయించిన రూ.2 వేలను ప్రభుత్వమే పాఠశాలల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జగన్ అమ్మఒడి పథకం ద్వారా స్కూల్ అభివృద్ధికి రూ.వెయ్యి కట్‌చేస్తే అన్యాయం అంటూ గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు రూ.2 వేలు ఎలా మినహాయిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు రాయుడు శంకర్, పితాని సత్తిబాబు, దేవు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడంలో నేర్పరి

- చంద్రబాబు ప్రభుత్వంపై తోట మండిపాటు
- ఖజానా ఖాళీ అంటూ కల్లబొల్లి మాటలు
- మా పథకాలే కాపీ కొట్టారు



మండపేటలో జగన్ అంటే నమ్మకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో విజయవంతంగా పారదర్శకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలపై అప్పటి ప్రతిపక్ష కూటమి నేతలు దుష్ప్రచారం చేశారని, అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయంలో మరలా అవే జగన్ పథకాలను కాపీ కొడుతూ అంతకంటే ఎక్కువ ఆర్థిక సాయం అందిస్తామంటూ ఇబ్బడి ముబ్బడిగా హామీలిచ్చారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలను మభ్య పెట్టడంలో చంద్రబాబు నేర్పరి అని, అధికారంలోకి రావడం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాకా ఖజానా ఖాళీ అంటూ లెక్కలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విపత్కర కాలంలోనూ సంక్షేమం

కరోనా లాంటి ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక విపత్కర కాలంలో సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశాన్ని ఆలోచింపజేసే స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించారన్నారు. అందుకే జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని జనం చెప్పుకుంటున్నారన్నారు. ఇచ్చిన హామీలను ఏడాదికాలం పాటు విస్మరించారన్నారు. ప్రధాన హామీలు ఇప్పటికీ అమలు చేయడంలేదన్నారు. ప్రజలకు మేలు చేయడాన్ని పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం, సామాన్య ప్రజల భద్రతను గాలికి వదిలేయడం తప్పితే ఏడాది పాలనలో ఒరగబెట్టింది ఏం లేదని విమర్శించారు.

రెడ్ బుక్ రాజ్యాంగం

రాష్ట్రంలో 766 మంది వైసీపీ నాయకులు కార్యకర్తలపై హత్యాయత్నాలు చేశారన్నారు. 203 మంది అమాయక మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరిగినా చర్యలు కానరావడం లేదన్నారు. కూటమి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలతో కలిసి ప్రతిఘటిస్తామన్నారు. చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్న బాబు, ఎంపీపీలు నొడు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాసు, విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కుడుపూడి రాంబాబు, మండపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ కార్యదర్శి బలరాం తదితరులు



రాయవరం తహసీల్దారు శెట్టికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఆయాల అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం: అంగన్‌వాడీల పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, సంక్షేమ పథకాలు ఇవ్వాలని, రేషన్‌కార్డు అందించాలని కోరుతూ సీఐటీయూ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పిలుపులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శులు మేడిశెట్టి దుర్గమ్మ, ఈ.ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలందరూ పేద కుటుంబాలకు చెందినవారున్నారన్నారు. పేద గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని, అంగన్వాడీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేసి రూ.12 వేల లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా అమలు చేయలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్, మినీవర్కర్‌కు రూ.7 వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదైనందున సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్యకుమారి, వీఎల్ రత్నం, బీటీఎల్ మాణిక్యాంబ, వెంకటరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రాయవరం: అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల పిల్లలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ కార్యకర్తలు, ఆయాల అసోసియేషన్ నేతలు సోమవారం తహసీల్దారు ఐ.పి.శెట్టికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నేతలు డి.ఆదిలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి, వై.పద్మావతి, కమల తదితరులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్‌కు రూ.11,500, హెల్పర్, మినీ వర్కర్లకు నెలకు రూ.7వేల మాత్రమే గౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదైనందున సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. రిటైర్ అయిన వారికి పెన్షన్ కూడా రావడం లేదన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందచేశారు.

గోదారి గట్టుపై మాకేదీ దారి

- ఇసుక లారీల తాకిడితో గ్రామస్తుల ఆవేదన
- వాహనాలను నిలిపివేసి నిరసన



కపిలేశ్వరపురం వద్ద గోదారి గట్టుపై వాహనాలు నిలిపి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: స్థానిక ఇసుక ర్యాంపు నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో గోదారిగట్టు సర్వనాశనం అవుతుందని, రేగుతున్న దుమ్ముతో గట్టు చెంత ఉన్న నివాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులంతా ఐక్యంగా కలసి సత్యనారాయణపురం వద్ద గోదారి గట్టుపై ఇసుక వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. విచ్చలవిడిగా తిరుగుతున్న భారీ వాహనాలతో రహదారి గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చినుకులు పడినప్పుడు రహదారి చిత్తడిగా మారి ప్రమాదభరితంగా రహదారి మారుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని మెరుగుపర్చాలని, వాహనాల వేగ నియంత్రణ నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆందోళన కారులు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కాజులూరు: మండలంలోని తణుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మెన్ వల్లు అర్జునరావు, మండల బీసీ సెల్ నాయకుడు పితాని సతీష్‌కుమార్, వనుం బాలకృష్ణ తదితరులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో 585/600 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన స్థానిక పాఠశాల విద్యార్థిని వాసంశెట్టి చరణ్‌దీప్తిని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కాశా శ్రీను, కేతా సద్గురుమూర్తి, కొప్పుశెట్టి భీమేశ్వరరావు, రాచపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే నయమయ్యే అవకాశం

కపిలేశ్వరపురం: సకాలంలో గుర్తించగలిగితే క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, అధునాతనమైన మందులతో నయం చేసుకునే అవకాశాలున్నాయని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి, డాక్టర్ శిరీష అన్నారు. టీబీ,ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై సోమవారం పడమర ఖండ్రికలో అవగాహన సమావేశం నిర్వహించారు. టీబీ హారేగా దేశ్ జీతేగా అంటూ నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. వైద్యులు రత్నకుమారి, శిరీష మాట్లాడుతూ శరీరంలో అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయ వ్యాధి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈనెల 2 నుంచి ఆగస్టు 30 వరకూ క్షేత్ర స్థాయిలో టీబీ ముక్త, భారత్ అభియాన్ అవగాహన శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరావు, ఎంఎల్‌హెచ్‌పి దేవి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు బేబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఒత్తిడితోనే 'తల్లికి వందనం'



యరమాటి వెంకన్నబాబు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ జరిపిన ఉద్యమాల ఫలితంగానే నేడు ప్రజలకు ఖాతాల్లోకి ప్రభుత్వం జమచేస్తున్న తల్లికి వందనం నిధులు అందుతున్నాయని పార్టీ నియోజకవర్గ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో అప్పటి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వంపై గెలవలేమన్న అంచనాకు వచ్చిన కూటమి నేతలు ఎన్నికల ప్రచార సమయంలో ఇబ్బడిముబ్బడిగా ఆచరణ సాధ్యంకాని హామీలను గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చాకా ఏడాదికాలంలో ఇవ్వాల్సిన ఆర్థకసాయం తాలూకు పథకాలన్నింటిని విస్మరించిందన్నారు. పార్టీ తరపున చేసిన ఆందోళనలు ఫలితంగా నేడు కూటమి ప్రభుత్వం తల్లికివందనం సాయాన్ని పంపిణీ చేస్తుందన్నారు. 2024-25 విద్యాసంవత్సరం తాలూకు పెండింగ్ సాయం సొమ్మును త్వరితగతిన తల్లుల ఖాతాలకు జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ తోట పలకరింపులు

కపిలేశ్వరపురం (మండపేట): అనారోగ్యంతో ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ద్వారపూడి గ్రామం ఉప సర్పంచ్ తులా శేషారావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పలకరించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శేషారావుకు ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు కొండపల్లి రాంబాబు, కె.రాములను ఇంటికెళ్లి పలకరించారు. ఎమ్మెల్సీ తోట వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు కుడుపూడి రాంబాబు, సిరిపురపు శ్రీనివాస్, అడబాల బాబ్జి, పోతుల ప్రసాద్ ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లోని వల్లూరు ఫీడర్ సాంకేతిక సమస్యలు తలెత్తిన నేపథ్యంలో సోమవారం ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు పర్యవేక్షణలో సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులనూ పూర్తి చేశారు.

సైన్స్ ల్యాబ్‌కు విరాళం



పసలపూడిలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న సుహాస్‌రెడ్డి

రాయవరం: మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ అభివృద్ధి నిమిత్తం దాతలు సోమవార విరాళం అందించారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి(బాబులు) తనయుడు సుహాస్‌రెడ్డి చేతుల మీదుగా రూ.50 వేల నగదును పాఠశాల హెచ్‌ఎం నూలు ఆదినారాయణకు అందజేశారు. సుహాస్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి, స్థానిక నేత మల్లిడి రామారెడ్డి(బాటు), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సమావేశం

రామచంద్రపురం రూరల్: 11 ఏళ్ల మోదీ ప్రభుత్వం అమృతకాలం అంటూ బీజేపీ సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 11 ఏళ్లుగా మోదీ నాయకత్వంలో దేశ ప్రజలకు సుపరిపాలన అందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సలాది వీరబాబు, బీవీఆర్ చౌదరి, దొంతంశెట్టి ఓంప్రకాశ్, వాసంశెట్టి రాజేశ్వరిదేవి, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తత అవసరం

కపిలేశ్వరపురం: అతిసార వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం వైద్యాధికారి డా.కె.విజయ హెచ్చరించారు. ఐడీసీఎఫ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని వల్లూరు, నల్లూరు, అచ్యుతాపురం, కాలేరు, వడ్లమూరు, వెదురుమూడి గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల లోపు చిన్నారులు నీళ్ల విరేచనాలకు లోనుకాకుండా సంరక్షకులు జాగ్రత్త వహించాలని, లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వైద్యాధికారి విజయ తెలిపారు. డీఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ సీహెచ్.గోపాలకృష్ణ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు అందజేత

రాయవరం: మండలానికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సోమవారం మండల స్థాయిలో బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మండల విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి చేతుల మీదుగా ఉత్తర్వులను నూతన ఉపాధ్యాయులు అందుకున్నారు. పాఠశాలలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు బాధ్యతతో కర్తవ్య నిర్వహణ చేపట్టాలని ఎంఈవో రామలక్ష్మణమూర్తి సూచించారు.

ఆలింకో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

రామచంద్రపురం రూరల్: ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) సేవలను సద్వినియోగం చేసుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారుగా రూ.86 లక్షలతో 270 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారన్నారు. కృత్రిమ అవయవాల ఉపకరణాలు వాటి భాగాల లభ్యత, వినియోగం, సరఫరా పంపిణీని ప్రోత్సహిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్, దృష్టి లోపం, వినికిడి లోపం, మేధో వైకల్యం గల వికలాంగుల ఆరోగ్య సంరక్షణ కోసం పరికరాలు వ్యక్తిగత రక్షణ కిట్లు ఉచితంగా అందిస్తుందన్నారు. బ్యాటరీ ఆపరేటర్ మోటార్ సైకిళ్లు 68, ట్రై సైకిళ్లు 41, వీల్ చైర్లు 62, నడక కర్రలు 30 మందికి, అత్యాధిక డిజిటల్ వినికిడి యంత్రాలు బ్యాటరీలతో సహా 22 మందికి ఉచితంగా ఆయన సంస్థ తరపున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలింకో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, పీఅండ్‌ఓ రవికుమార్, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, ఎంపీడీవో పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'స్నేహ' హస్తం



నిత్యావసర వస్తువులు, సామగ్రిని అందజేస్తున్న స్వచ్ఛంద సేవ సభ్యులు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి 'స్నేహ' స్వచ్ఛంద సేవా టీమ్ సభ్యులు చేయూతగా నిలిచారు. వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందగా, భార్య, పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న స్వచ్ఛంధ సంస్థ నిరుపేద కుటుంబానికి 'స్నేహ' హస్తాన్ని అందించింది. రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, 50 కిలోల బియ్యం, కిరాణా, కూరగాయలు, కొంత మొత్తంలో నగదును అందజేశారు. నిరుపేద కుటుంబం పట్ల చూపించిన మానవత్వానికి పలువురు గ్రామస్తులు స్వచ్ఛంధ సంస్థ సభ్యులను అభినందించారు.

కూటమి వైఫల్యాలపై నేడు పుస్తకావిష్కరణ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం రూరల్ మండలంలోని హసన్‌బాద గ్రామంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంటి సమీపంలోని బీసీ కల్యాణ మండపంలో నేటి ఉదయం 10 గంటలకు 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.